


నేటి దినపత్రిక
# సూర్య
www.suryaa.com
EVENING EDITION
www.suryaa.com పేజీలు: 02

## కర్ణాటకలో హుక్కాపై నిషేధం




కర్ణాటక ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ప్రజా ఆరోగ్యాన్ని రక్షించే లక్ష్యంతో హుక్కా ధూమ పానంపై నిషేధం విధించింది. రాష్ట్ర ఆరోగ్య మంత్రి దినేష్ గుండూరావు గురువారం ఈ మేరకు ప్రకటన జారీ చేశారు. "ప్రజా ఆరోగ్యం, యువతను రక్షించే ఉద్దేశంతో హుక్కాపై రాష్ట్రవ్యాప్త నిషేధం విధించాం. హుక్కా ధూమపానంతో తీవ్రమైన ఆరోగ్య ప్రమాదాలు ఉన్నాయి. అందుకే సిగరెట్లు,ఇతర పొగాకు ఉత్పత్తుల చట్టంను సవరించాం. హుక్కా ధూమపానాన్ని నిషేధించాలని నిర్ణయించాం." అని ఆరోగ్య మంత్రి దినేష్ గుండూరావు తెలిపారు.

## వడ్డీరేట్లు యథాతథం: ఆర్బీఐ

రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా గవర్నర్ ఆధ్వర్యంలోని మానిటరీ పాలసీ కమిటీ వడ్డీ రేట్లపై కీలక నిర్ణయం తీసుకుంది. కీలకమైన రెపో రేటును స్థిరంగా ఉంచాలని నిర్ణయించినట్లు ఆర్బీఐ గవర్నర్ శక్తికాంత దాస్ వెల్లడించారు. ఆర్థికవేత్తలు ఊహించినట్టుగానే ఆర్బీఐ మానిటరీ పాలసీ కమిటీ నిర్ణయం తీసుకుంది. కీలకమైన రెపో రేటును 6.5 శాతం వద్ద యథాతథంగా కొనసాగించాలనే ఆరుగురు సభ్యుల ద్రవ్య విధాన కమిటీ నిర్ణయించింది. రెపో రేటులో ఎటువంటి మార్పు లేకుండా యథాతథంగా కొనసాగించడం ఇది ఆరోసారి. "మారుతున్న స్థూల ఆర్థిక పరిణామాలు, దృక్పథాలను వివరణాత్మకంగా అంచనా వేసిన తర్వాత ద్రవ్య విధాన కమిటీ ఐదుగురు సభ్యుల మెజారిటీతో పాలసీ రేటును 6.5 శాతం వద్ద యథాతథంగా ఉంచాలని నిర్ణయించింది" అని ఆర్బీఐ గవర్నర్ శక్తికాంత దాస్ పేర్కొన్నారు.

## బుమ్రా నం.1 బౌలర్



భారత్ నుంచి ఎంతోమంది పేస్ బౌలర్లు టెస్టుల్లో పలుమార్లు అత్యుత్తమ ప్రదర్శనతో అలరించారు. కానీ ఏనాడూ అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ (ఐసీసీ) బౌలింగ్ ర్యాంకింగ్స్‌లో అగ్రస్థానాన్ని దక్కించుకోలేకపోయారు. అయితే ఆ లోటును తీరుస్తూ జస్‌ప్రీత్ బుమ్రా ఐసీసీ టెస్టు బౌలింగ్ ర్యాంకింగ్స్‌లో నంబర్‌వన్ స్థానాన్ని అందుకున్న తొలి భారతీయ పేస్ బౌలర్‌గా అవతరించాడు. ఐసీసీ టెస్టు బౌలింగ్ ర్యాంకింగ్స్‌లో 30 ఏళ్ల బుమ్రా మూడు స్థానాలు ఎగబాకి తన కెరీర్‌లో తొలిసారి ఈ ఫార్మాట్‌లో టాప్ ర్యాంక్‌కు చేరుకున్నాడు. విశాఖపట్నంలో ఇంగ్లండ్ జట్టుతో జరిగిన రెండో టెస్టులో బుమ్రా తన పేస్ పదునుతో తొమ్మిది వికెట్లు (6/45; 3/46) పడగొట్టి భారత విజయంలో కీలకపాత్ర పోషించడంతోపాటు 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' పురస్కారం గెల్చుకున్నాడు. బుమ్రా ఖాతాలో ప్రస్తుతం 881 రేటింగ్ పాయింట్లు ఉన్నాయి. గత ర్యాంకింగ్స్‌లో 'టాప్' ర్యాంక్‌లో ఉన్న భారత స్పిన్నర్ అశ్విన్ రెండు స్థానాలు పడిపోయి 841 రేటింగ్ పాయింట్లతో మూడో స్థానానికి చేరుకున్నాడు. దక్షిణాఫ్రికా పేసర్ కగిసో రబడ 851 రేటింగ్ పాయింట్లతో రెండో ర్యాంక్‌ను నిలబెట్టుకున్నాడు. ఇప్పటి వరకు భారత్ నుంచి నలుగురు బౌలర్లు మాత్రమే ఐసీసీ టెస్టు బౌలింగ్ ర్యాంకింగ్స్‌లో నంబర్‌వన్ ర్యాంక్‌లో నిలిచారు.

## తదుపరి టెస్టులకూ దూరం!

[redacted] వరకు రాజ్‌కోట్‌లో, నాలుగో టెస్టు ఈనెల 23 నుంచి 27 వరకు రాంచీలో జరగనున్నాయి. చివరిదైన ఐదో టెస్టు మార్చి 7 నుంచి 11 వరకు ధర్మశాలలో జరగుతుంది. తాను జట్టుకు ఎప్పుడు అందుబాటులో ఉంటాననే విషయంపై కోహ్లి బీసీసీఐకి ఇంకా సమాచారం ఇవ్వలేదని తెలిసింది.

## మళ్లీ కెప్టెన్‌గా బాబర్ ఆజం!

[redacted] సమాచారం. కాగా వన్డే వరల్డ్‌కప్-2023లో ఘోర ప్రదర్శనకు నైతిక బాధ్యత వహిస్తూ బాబర్ ఆజం అన్ని ఫార్మాట్లలో పాకిస్తాన్ కెప్టెన్సీకి గుడ్‌బై చెప్పాడు. ఈ క్రమంలో అప్పటి పీసీబీ ప్రెసిడెంట్ జకా అష్రఫ్.. పాక్ టెస్టు కెప్టెన్‌గా షాన్ మసూద్, టీ20 కెప్టెన్‌గా షాహీన్ అఫ్రిదిని నియమించాడు. అయితే కెప్టెన్సీలో మార్పులు చోటుచేసుకున్నాక పాకిస్తాన్ జట్టు పరిస్థితి మరింత అధ్వానంగా మారింది. కొత్త కెప్టెన్లతో ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ పర్యటనలకు వెళ్లిన పాకిస్తాన్.. అక్కడ ఘోర ప్రదర్శన కనబరిచింది.

## వేణుగోపాల్ ఇంట్లో ముగిసిన ఎన్ఐఏ సోదాలు




నగరంలోని పలు చోట్ల ఎన్ఐఏ సోదాలు కొనసాగుతున్నాయి. వీక్షణం పత్రిక ఎడిటర్ వేణుగోపాల్ ఇంట్లో గురువారం తెల్లవారుజాము నుంచే ఎన్ఐఏ సోదాలు నిర్వహించింది. ఎల్బీనగర్‌లోని శ్రీనివాస నగర్ కాలనీలోని రవిశర్మ ఇంటిపై ఎన్ఐఏ సోదాలు ముగిశాయి. ఈ క్రమంలోనే రవిశర్మ ఇంటిపై దాడి చేసిన ఎన్ఐఏ అధికారులు. రవిశర్మ మొబైల్‌తో పాటు పాత బుక్స్, 1990 కంటే ముందు ఉన్న ఫొటోలకు చెందిన కరపత్రాలు స్వాధీనం చేసుకున్న ఎన్ఐఏ అధికారులు. ఈ నెల 10న ఎన్ఐఏ కార్యాలయానికి హాజరు అవ్వాలని ఆదేశాలు జారీ చేసిన NIA అడిషనల్ ఎస్పీ రాజ్‌కుమార్.



# ఆరు గ్యారంటీలను సకాలంలో అమలు చేస్తాం

## గవర్నర్ తమిళిసై

నాలుగు కోట్ల ప్రజల ఆకాంక్ష, యువత బలిదానాలు, విద్యార్థుల అలుపెరగని పోరాటాల ద్వారా తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందని గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ అన్నారు. తెలంగాణ ఏర్పాటులో కీలక పాత్ర పోషించిన వారందరికీ తమ ప్రభుత్వం కృతజ్ఞతలు తెలియజేస్తున్నదని చెప్పారు. రాష్ట్ర ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పరిపాలించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. శాసన సభ బడ్జెట్ సమావేశాల నేపథ్యంలో ఉభయ సభలను ఉద్దేశించి గవర్నర్ తమిళిసై ప్రసంగించారు. మహాకవి కాళోజీ మాటలతో ప్రసంగాన్ని ప్రారంభించారు. 'ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు తమ ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధి కోసం ఆరు గ్యారంటీలను అమలు చేయడానికి కట్టుబడి ఉంది. అందులో రెండు గ్యారంటీలను ఇప్పటికే అమలు చేశాం. మహాలక్ష్మి పథకం కింద ఇప్పటికే 15 కోట్ల మంది మహిళలు ఉచిత బస్సు రవాణా సదుపాయాన్ని ఉపయోగించుకున్నారు. త్వరలో మరో రెండు గ్యారంటీలను అమలు చేస్తుంది.ప్రజాపాలన కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించింది. వివిధ వర్గాల ప్రజల నుంచి 1.28 కోట్లకుపైగా దరఖాస్తులు అందాయి. నిర్దిష్ట సమయంలోగా ఆరు హామీలను అమలు చేస్తాం. మహాలక్ష్మి పథకం కింద అర్హులైన కుటుంబాలకు రూ.500లకే గ్యాస్ సిలిండర్, గృహజ్యోతి పథకం కింద 200 యూనిట్ల ఉచిత గృహ విద్యుత్‌ను అందిస్తాం. కొత్తగా ఏర్పాటు చేసిన టీఎస్‌పీఎస్సీ ద్వారా 2 లక్షల ఉద్యోగాలను భర్తీ చేస్తాం. పాలమూరు-రంగారెడ్డి వంటి సాగునీటి ప్రాజెక్టుల నుంచి విద్యారంగం వరకు తెలంగాణలోని వివిధ రంగాలు తమ భవిష్యత్ ప్రణాళికలో ఉన్నాయి. హైదరాబాద్ గత వైభవాన్ని పునరుద్ధరించాలని, అదే సమయంలో రాష్ట్ర మంతటా అభివృద్ధిని వికేంద్రీకరించాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. ఆర్థిక క్రమశిక్షణ, పారదర్శకతను పునరుద్ధరించడానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉంది. ప్రజలపై భారం మోపకుండా రాష్ట్ర ఆర్థిక స్థితిగతులను మెరుగుపరచడమే ప్రభుత్వానికి తక్షణ సవాలు. ప్రభుత్వ ఆర్థిక వ్యవస్థ పునరుద్ధరణ, నిర్వహణలో బాధ్యత, జవాబుదారీతనాన్ని అవలంభించడానికి ఈ బడ్జెట్ ఒక సదావకాశం. రాష్ట్రంలో అత్యధిక జనాభాకు జీవనోపాధిని సమకూరుస్తున్న వ్యవసాయం వెన్నెముకగా ఉంది. ఆర్థిక వ్యవస్థలో వ్యవసాయం పోషించే కీలక పాత్రను గుర్తిస్తూ, రైతుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది. రైతు భరోసా, పంట రుణమాఫీ, పంట మార్పిడీ కార్యక్రమాలు, ఉద్యానవన అభివృద్ధి, నాణ్యమైన విత్తనాలు, ఆధునిక వ్యవసాయ పద్ధతులతో రైతాంగ సాధికారతను లక్ష్యంగా పెట్టుకున్నాం. నూతన ఎంఎస్ఎంఈ విధానాన్ని తీసుకురావడంతోపాటు ఎంఎస్ఎంఈలకు సహాయపడటానికి, వారి ఇబ్బందులను నివారించడానికి ఒక ప్రత్యేక సంస్థాగత యంత్రాంగాన్ని ఏర్పాటు చేస్తాం. ఐటీ, ఫార్మా వంటి రంగాలకు ప్రభుత్వ సహకారం కొనసాగుతుంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దావోస్ పర్యటనలో భాగంగా రూ.40 వేల కోట్ల ఒప్పందాలు జరిగాయి. రాష్ట్రంలో డిజిటల్ మౌలిక సదుపాయాలను సృష్టించడమే కాకుండా, సమాజంలోని అన్ని వర్గాలకు కనీస ధరలకే అందుబాటులోకి తేవడంపై దృష్టి సారిస్తాం. ప్రతి కుటుంబం వేగవంతమైన డిజిటల్ అనుసరణ అవకాశాల ద్వారా వచ్చే ప్రయోజనం పొందేందుకు ఒక సార్వజనీన సమగ్ర డిజిటల్ అక్షరాస్యత కార్యక్రమాన్ని అమలు చేస్తాం. హైదరాబాద్‌ను కృత్రిమ మేధస్సుకు ప్రధాన కేంద్రంగా అభివృద్ధి చేస్తాం. 50 నుంచి 100 ఎకరాల్లో ఏఐ సిటీని ఏర్పాటు ప్రభుత్వం ఏర్పాటు చేస్తుంది. రూ.2 వేల కోట్ల వ్యయంతో రాష్ట్రంలోని ప్రభుత్వ ఐటీఐలను ఆధునిక టెక్నాలజీ సెంటర్లుగా మార్చనుంది. రాష్ట్రంలో నైపుణ్య విశ్వవిద్యాలయాలను ఏర్పాటు చేస్తుంది. వేగంగా మారుతున్న జాబ్ మార్కెట్ డిమాండ్లకు అనుగుణంగా అవసరమైన పరిజ్ఞానం, నైపుణ్యంతో యువతను సన్నద్ధం చేస్తూ ఇవి ప్రతిభా కేంద్రాలుగా పనిచేస్తాయి. విద్యుత్ అవసరాలకు రాష్ట్రం ప్రధానంగా బొగ్గుపై ఆధారపడుతున్నది. విద్యుత్ ఉత్పాదక వ్యయాన్ని తగ్గించడానికి అలాగే పర్యావరణ పరిరక్షణల లక్ష్యాలను దృష్టిలో ఉంచుకొని స్వచ్ఛ ఇంధనపు వాటాను పెంచాల్సి వుంటుంది. అధిక డిమాండ్ అవసరాలను తీర్చడానికి హరిత ఇంధనం అంటే సౌర, పవన, హైబ్రిడ్‌తోపాటు నిల్వ ఇంధనం వంటి అన్ని రకాల హరిత ఇంధనాలను ప్రోత్సహించడానికి ప్రభుత్వం ఒక సమగ్ర 'ఇంధన పాలసీ'తో ముందుకు రానుంది. హరిత ఇంధనం వాటాను గణనీయంగా మెరుగుపరిచి, 2030 సంవత్సరం నాటికి కార్బన్ ఉద్గారాలను తగ్గించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకున్నది.' అని గవర్నర్ తమిళిసై అన్నారు. గవర్నర్ ప్రసంగం అనంతరం ఉభయ సభలు రేపటి వాయిదాపడ్డాయి.



## కోడి కత్తి కేసు నిందితుడు శ్రీనివాస్‌కు బెయిల్

కోడికత్తి కేసులో నిందితుడిగా ఉన్న జనిపల్లి శ్రీనివాస్‌కు ఎట్టకేలకు బెయిల్ లభించింది. ఐదేండ్ల క్రితం అప్పటి ప్రతిపక్ష నేత జగన్‌పై దాడి కేసులో శ్రీనివాస్‌ను పోలీసులు అరెస్టు చేశారు. అప్పటినుంచి జైల్లోనే ఉంటున్న ఆయనకు ఏపీ హైకోర్టు షరతులతో కూడిన బెయిల్ మంజూరుచేసింది. రూ.25 వేల పూచీకత్తుతో రెండు ష్యూరిటీలు సమర్పించాలని, ప్రతి ఆదివారం ముమ్మిడివరం పోలీస్ స్టేషన్‌లో హాజరు కావాలని స్పష్టం చేసింది.

## 'జనసేన'కు గాజుగ్లాసు గుర్తు.. హైకోర్టులో పిటిషన్




తమ పార్టీ దరఖాస్తును పట్టించుకోకుండా EC 'గాజు గ్లాసు' గుర్తును జనసేనకు కేటాయించిందని.. రాష్ట్రీయ ప్రజా కాంగ్రెస్(సెక్యూలర్) పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎం.శ్రీనివాస్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. గాజు గ్లాసును ఫ్రీ సింబల్‌గా 2023లో ఈసీ ప్రకటించిన వెంటనే.. ఆ గుర్తు కోసం మొదటగా దరఖాస్తు చేశానని పిటిషనర్ పేర్కొన్నారు. కాగా, ఈ వ్యాజ్యంపై విచారణ జరపనుంది.



## లాభాల్లో స్టాక్ మార్కెట్

ఆర్‌బీఐ ద్రవ్యపరపతి విధాన సమీక్ష నిర్ణయాలు వెలువడనున్న తరుణంలో దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు గురువారం లాభాలతో ప్రారంభమయ్యాయి. అంతర్జాతీయ మార్కెట్లలోని సానుకూల సంకేతాలు వీటికి దన్నుగా నిలుస్తున్నాయి. ఉదయం 9:27 సమయంలో సెన్సెక్స్ 214 పాయింట్లు లాభపడి 72,366 వద్ద ట్రేడవుతోంది. నిఫ్టీ 68 పాయింట్లు పుంజుకొని 21,998 దగ్గర కొనసాగుతోంది. డాలరుతో పోలిస్తే రూపాయి మారకం విలువ రూ.82.92 వద్ద ప్రారంభమైంది. సెన్సెక్స్-30 సూచీలో పవర్‌గ్రిడ్, హెచ్‌సీఎల్ టెక్, ఇండస్‌ఇండ్ బ్యాంక్, ఎం అండ్ ఎం, టీసీఎస్, విప్రో, ఎన్‌టీపీసీ, ఎస్‌బీఐ, ఇన్ఫోసిస్, సన్‌ఫార్మా, టైటన్, టెక్ మహీంద్రా షేర్లు లాభాల్లో ఉన్నాయి. ఐటీసీ, మారుతీ, బజాజ్ ఫైనాన్స్, నెస్లే ఇండియా, ఏషియన్ పెయింట్స్, అల్ట్రాటెక్ సిమెంట్, ఐసీఐసీఐ బ్యాంక్, టాటా మోటార్స్, జేఎస్‌డబ్ల్యూ స్టీల్ షేర్లు నష్టాల్లో కొనసాగుతున్నాయి.

## పాక్‌లో కొనసాగుతున్న ఎన్నికల పోలింగ్.. మొబైల్ సేవలపై ఆంక్షలు



పాకిస్థాన్ జాతీయ అసెంబ్లీతోపాటు పలు రాష్ట్రాల అసెంబ్లీలకు ఎన్నికల పోలింగ్ కొనసాగుతున్నది. సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ కొనసాగనుంది. ఉదయం నుంచే ఓటు హక్కును వినియోగించుకోవడానికి పోలింగ్ స్టేషన్ల వద్ద ఓటర్లు గుమికూడారు. మొత్తం 12.85 కోట్ల మందికిపైగా ఓటు వేయనున్నారు. జాతీయ అసెంబ్లీకి 5,121 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు. వీరిలో 4,807 మంది పురుషులు, 312 మంది మహిళలు, ఇద్దరు ట్రాన్స్ జెండర్లు ఉన్నారు. ప్రశాంత వాతావరణంలో పోలింగ్ జరగడానికి దేశవ్యాప్తంగా 6 లక్షల 50 మంది భద్రతా సిబ్బందిని మోహరించారు. కాగా, ఎన్నికల నేపథ్యంలో దేశంలో మొబైల్ సేవలను నిలిపివేశారు. భద్రతా పరమైన సమస్యలు తలెత్తకుండా ఈ మేరకు నిర్ణయం తీసుకున్నట్లు ఆర్మీ ప్రకటించింది.

**పోస్టల్ బ్యాలెట్ ద్వారా జైలు నుంచి ఓటేసిన ఇమ్రాన్ ఖాన్**

పాకిస్థాన్ మాజీ ప్రధాని ఇమ్రాన్ ఖాన్ తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. జైలు నుంచే ఆయన పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటేశారు. జైలుశిక్ష అనుభవిస్తున్న మరికొంత మంది రాజకీయ నాయకులు కూడా ఇవాళ జరుగుతున్న పోలింగ్‌లో తమ ఓటు హక్కును వినియోగించుకున్నట్లు తెలుస్తోంది. అయితే ఇమ్రాన్ ఖాన్ భార్య బుష్రా బీబీ మాత్రం ఓటు హక్కును వాడుకోలేదు. ఎందుకంటే పోస్టల్ ఓటింగ్ ప్రక్రియ ముగిసిన తర్వాత ఆమెను అరెస్టు చేయడం వల్ల ఓటు వేయలేని పరిస్థితి వచ్చింది. మెయిల్ ద్వారా ఓటేసిన నేతల్లో మాజీ విదేశాంగ మంత్రి షా మహమూద్ ఖురేషి, మాజీ పంజాబ్ సీఎం చౌదరీ పర్వేజ్ ఇలాహి, అవామీ ముస్లిం లీగ్ చీఫ్ షేక్ రషీద్, మాజీ సమాచారశాఖ మంత్రి ఫహద్ చౌదరీ ఉన్నారు. అడియాలా జైలులో ఉన్న ఖైదీల్లో వంద మంది ఓటు వేశారు.

## సింగిల్ ఛార్జింగ్‌తో 110 కి.మీ. నడిచే నయా లూనా


అప్పుడెప్పుడో 30-40 ఏండ్ల క్రితం మార్కెట్‌లో హల్‌చల్ చేసిన లూనా.. మళ్లీ కొత్త రూపులో ముందుకొచ్చింది. 'ఈ-లూనా' పేరుతో దీన్ని దేశీయ మార్కెట్‌కు బుధవారం కైనెటిక్ గ్రీన్ పరిచయం చేసింది. ఈ విద్యుత్తు ఆధారిత (ఈవీ) ద్విచక్ర వాహనం.. రైతులు, చిరు వ్యాపారుల వినియోగానికి, వస్తూత్పత్తుల డెలివరీలకు వీలుగా ఉన్నది. వెనుక సీటును వేరుచేసుకునే సదుపాయం ఉన్న ఈ టూవీలర్‌పై సిలిండర్లు, పెట్టెలు, ఇతరత్రా సామాగ్రిని సులువుగా తరలించవచ్చని కంపెనీ వర్గాలు చెప్తున్నాయి. ఇక ఢిల్లీ ఎక్స్‌షోరూం ప్రకారం దీని ధర రూ.69,990. మల్‌బెర్రీ రెడ్, ఓషియన్ బ్లూ, పియర్ల్ ఎల్లో, స్పార్కలింగ్ గ్రీన్, నైట్ స్టార్ బ్లాక్ రంగుల్లో మోపెడ్ కస్టమర్లకు అందుబాటులో ఉంటుంది. ఒకినావా డ్యూయల్ 100, టీవీఎస్ ఎక్స్‌ఎల్ 100 తదితర మాడళ్లకు పోటీ నివ్వగలదని మార్కెట్ వర్గాలు అంచనా వేస్తున్నాయి.



సూర్య www.suryaa.com EVENING EDITION 4PM

# యాత్ర 2 రివ్యూ

హీరో జీవా, మళయాళ సీనియర్ హీరో మమ్ముట్టి కీలక పాత్రల్లో దర్శకుడు మహి వి రాఘవ తెరకెక్కించిన చిత్రమే "యాత్ర 2". కాగా ఈ చిత్రం ఈ రోజు విడుదల అయింది. మరి ప్రేక్షకులను ఈ చిత్రం ఏ మేరకు మెప్పించిందో సమీక్షలోకి వెళ్లి తెలుసుకుందాం! వైఎస్ రాజశేఖర్ రెడ్డి (మమ్ముట్టి) తన కొడుకు జగన్ (జీవా) ని 2009 ఎన్నికల్లో కడప ఎంపీగా నిలబెడుతున్నాను అని ప్రజలకు పరిచయం చేస్తూ ఈ కథ మొదలవుతుంది. ఆ తర్వాత.. ఎన్నికల్లో గెలవడం, వైఎస్సార్ సీఎం అవ్వడం చూపిస్తారు. ఐతే, వైఎస్ రాజశేఖర్ రెడ్డి మరణం తర్వాత వైయస్ జగన్మోహన్ రెడ్డి చేపట్టిన 'పరామర్శ యాత్రను' ఆపేయమనడంతో జగన్ ప్రత్యేక పార్టీ పెట్టి, బై ఎలక్షన్స్ లో గెలుస్తాడు. ఈ క్రమంలో జరిగిన కొన్ని నాటకీయ పరిణామాల మధ్య జగన్ పై సీబీఐ దాడులు జరుగుతాయి. జగన్ అరెస్ట్ అవుతాడు. ఆ తర్వాత జరిగిన ఎన్నికల్లో చంద్రబాబు (మహేష్ మంజ్రేకర్) సీఎం అవ్వడం, మొదటిసారి జగన్ ఎన్నికల్లో ఓడిపోయి ప్రతిపక్ష నేతగా ఉండటం వంటి సంఘటనలు జరుగుతాయి. చివరకు జగన్ పాదయాత్రను ఎలా చేశాడు ?, చివర్లో 2019 లో జగన్ సీఎం ఎలా అయ్యాడు ? అనేది మిగిలిన కథ. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి సెమీ బయోపిక్ గా వచ్చిన ఈ యాత్ర 2 లో వైఎస్ఆర్ మరణానంతరం ప్రజల భావోద్వేగాలను, అలాగే తన తండ్రి బాటలో నడవాలనే తన లక్ష్యాన్ని జగన్ ఎలా గ్రహించాడు ?, ఆ లక్ష్యం కోసం ఎన్ని కష్టాలు పడ్డాడు ?, చివరకు సొంతంగా పార్టీ పెట్టి, సమర్థవంతంగా ఆ పార్టీని నడిపించి.. చివరకు అనుకున్న లక్ష్యాన్ని ఎలా చేరుకున్నాడు ? వంటి అంశాలు సినిమాలో బాగా ఆకట్టుకున్నాయి. మహి వి రాఘవ దర్శకత్వం కూడా బాగుంది. హీరో జీవా వైఎస్ జగన్మోహన్ రెడ్డిగా చాలా బాగా నటించాడు. లెజెండరీ నటుడు మమ్ముట్టి కూడా 'యాత్ర 2' లో కనిపిస్తారు. ఆయన కూడా అద్భుతంగా నటించారు. అదే విధంగా ఈ సినిమాలో సోనియా పాత్రలో జర్మన్ నటి సుజానే బెర్నెర్ట్ కూడా చాలా బాగా నటించింది. చంద్రబాబు పాత్రలో మహేష్ మంజ్రేకర్ కూడా చక్కగా నటించాడు. అదే విధంగా మిగిలిన ప్రధాన నటీనటులు కూడా అయా పాత్రల్లో తమ నటనతో ఆకట్టుకున్నారు. ముఖ్యంగా ఆయా ఒరిజినల్ పాత్రలను బాగా ఇమిటేట్ చేస్తూ నటులందరూ ఆకట్టుకున్నారు. మొత్తానికి దర్శకుడు రాసుకున్న సీన్లు మరియు ఎమోషన్స్ అండ్ పాత్రల ఎలివేషన్స్ కొన్ని చోట్ల ఆసక్తిగా సాగుతూ ఆకట్టుకుంటాయి. దర్శకుడు మహి వి రాఘవ తీసుకున్న వాస్తవిక కథాంశం బాగున్నప్పటికీ.. కథనం మాత్రం కొన్ని చోట్ల సింపుల్ గా స్లోగా సాగుతుంది. ముఖ్యంగా ఫస్ట్ హాఫ్ లోని కొన్ని సీక్వెన్స్ అలాగే సెకండాఫ్ స్టార్టింగ్ సీక్వెన్స్ ఆసక్తికరంగా సాగలేదు. ఇక జగన్ – ప్రత్యర్థి పార్టీ నాయకుల మధ్య వచ్చే కొన్ని రాజకీయ సన్నివేశాలు కూడా చాలా రెగ్యులర్ గానే అనిపిస్తాయి. మొత్తానికి దర్శకుడు తాను అనుకున్న కంటెంట్ ను స్క్రీన్ మీద బాగా ఎలివేట్ చేసినా.. సినిమాలో కొన్ని రొటీన్ పొలిటికల్ సీన్స్ ను ట్రిమ్ చేసి వుంటే సినిమాకి ఇంకా ప్లస్ అయ్యేది. అలాగే, స్క్రీన్ ప్లే విషయంలో కూడా జాగ్రత్తలు తీసుకోవాల్సింది, ఇంటర్వెల్ లో ఎమోషన్స్ పెంచి... సెకండాఫ్ పై కొంత ఇంట్రెస్ట్ పెంచే ప్రయత్నం చేసినా.. అది అంత ఎఫెక్టివ్ గా వర్కౌట్ కాలేదు. ఇక క్లైమాక్స్ కూడా అందరూ ఊహించిన విధంగానే సాగింది. సాంకేతిక నిపుణుల గురించి మాట్లాడుకుంటే.. మహి వి రాఘవ దర్శకుడిగా మంచి కథాంశంతో ఆకట్టుకున్నాడు. అలాగే, ఆయన టేకింగ్ కూడా చాలా బాగుంది. కానీ, స్క్రీన్ ప్లే రాసుకోవడంలో ఆయన తడబడ్డారు. సంగీత దర్శకుడు అందించిన పాటలు బాగున్నాయి. అదే విధంగా బ్యాక్ గ్రౌండ్ స్కోర్ కూడా కొన్ని కీలక సన్నివేశాల్లో బాగుంది. ఇక ఎడిటర్ అనవసరమైన సీన్స్ ని ఇంకా టైట్ గా ట్రీమ్ చేసి ఉండి ఉంటే, సినిమాకి ప్లస్ అయ్యేది. సినిమాటోగ్రఫీ కూడా బాగుంది. నిర్మాత శివ మేక పాటించిన నిర్మాణ విలువలు చాలా బాగున్నాయి. పొలిటికల్ ఎమోషనల్ డ్రామాగా వచ్చిన ఈ 'యాత్ర 2' జగన్ అభిమానులకు, వైఎస్ రాజశేఖర్ రెడ్డి అభిమానులకు ఓ ఎమోషనల్ ఫీస్ట్ గా నిలుస్తోంది. జగన్ పొలిటికల్ గ్రాఫ్ తో పాటు వైఎస్ఆర్ – జగన్ మధ్య ఎమోషన్స్ మరియు బాండింగ్ కూడా ఆకట్టుకున్నాయి. అలాగే, బీజీఎం, కొన్ని డైలాగ్స్ బాగున్నాయి. ఐతే, ఈ సినిమాలో కొన్ని సీక్వెన్స్ స్లోగా సాగడం, అలాగే రొటీన్ గా సాగే కొన్ని పొలిటికల్ సీన్స్ సినిమాకి మైనస్ అయ్యాయి. కాకపోతే, మమ్ముట్టి – జీవా తమ నటనతో సినిమాని మరో లెవల్ కి తీసుకువెళ్లారు. ఓవరాల్ గా ఈ 'యాత్ర 2' చిత్రం వైసీపీ అభిమానులను చాలా బాగా మెప్పిస్తుంది.








## పార్లమెంట్ వేదికగా వైట్ పేపర్- బ్లాక్ పేపర్ ఫైట్..!

తన పదేళ్ల పాలనపై కేంద్రంలోని అధికార బీజేపీ గురువారం 'వైట్‌పేపర్'ను పార్లమెంట్‌లో ప్రవేశపెట్టనుండగా.. కాంగ్రెస్ 'బ్లాక్ పేపర్'తో కౌంటర్ ఇవ్వనుంది. ఫిబ్రవరి 1న తాత్కాలిక బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన సందర్భంగా ఆర్థికమంత్రి నిర్మలాసీతారామన్ ఈ శ్వేతపత్రాన్ని సమర్పిస్తామని వెల్లడించారు. 2014 ముందు వరకు, ఆ తర్వాత దేశ ఆర్థిక పరిస్థితి మధ్య తేడాను వెల్లడించే ఉద్దేశంతో దానిని పార్లమెంట్‌లో ఉభయ సభల ముందు ఉంచుతామన్నారు. దాని ద్వారా గత పాలనలో లోపాలను ఎత్తిచూపడమే తమ లక్ష్యమని చెప్పారు. ఆర్థిక వ్యవహారాలపై స్టాండింగ్ కమిటీ ఛైర్మన్, భాజపా నేత జయంత్ సిన్హా బుధవారం మాట్లాడుతూ.. 'యూపీఏ కాలంలో ఐదు బలహీన ఆర్థిక వ్యవస్థల్లో భారత్ ఒకటిగా ఉండేది. వృద్ధి రేటు నెమ్మదించి 5 శాతానికి పడిపోయింది. ద్రవ్యోల్బణం 10 శాతానికి పెరిగింది. బ్యాంకుల ఎన్‌పీఏలు 10 శాతానికి ఎగబాకాయి. ఆ సమస్యలను ఎలా పరిష్కరించామో శ్వేతపత్రంలో స్పష్టత ఇవ్వనున్నాం' అని వెల్లడించారు. దీనికి సమాధానంగా కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే బ్లాక్ పేపర్‌ను తీసుకురానున్నట్లు సమాచారం.

## ప్రధాని మోదీ కులంపై రాహుల్ గాంధీ సంచలన వ్యాఖ్యలు

ప్రధాని నరేంద్ర మోదీ కులంపై కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ సంచలన వ్యాఖ్యలు చేశారు. భారత్ జోడో న్యాయ్ యాత్రలో భాగంగా ఒడిషాలోని ఝార్సుగుడలో రాహుల్ మాట్లాడుతూ ప్రధాని మోదీ ఓబీసీ క్యాటగిరీలో జన్మించలేదని, గుజరాత్‌లోని తేలి కులంలో ఆయన జన్మించారని చెప్పారు. 2000 సంవత్సరంలో ఆ కులాన్ని బీజేపీ ఓబీసీ క్యాటగిరీలో చేర్చిందని అన్నారు. మోదీ సాధారణ కులంలోనే జన్మించారని, స్వతహాగా ఓబీసీ కాదని రాహుల్ ఆరోపించారు. మోదీ ఓబీసీగా జన్మించనందునే ఆయన తన జీవితాంతం కులగణన నిర్వహించేందుకు అనుమతించరని అన్నారు. ఇక రాహుల్ యాత్ర గురువారం ఒడిషా నుంచి చత్తీస్‌ఘఢ్‌లోకి ప్రవేశించనుంది. ఇటీవల ముగిసిన అసెంబ్లీ ఎన్నికల్లో పాలక కాంగ్రెస్ ఓటమి పాలైన అనంతరం రాహుల్ తొలిసారిగా ఆ రాష్ట్రంలోకి అడుగుపెట్టనున్నారు. ఇక రాహుల్ యాత్ర రాయ్‌ఘఢ్, కోర్బా జిల్లాల మీదుగా సాగుతూ ఫిబ్రవరి 14న బల్‌రాంపూర్ నుంచి జార్ఖండ్‌లోకి ప్రవేశిస్తుంది.



## 'యాత్ర-2' కోసం అసెంబ్లీని వాయిదా వేశారు



శాసనసభను వైకాపా ప్రభుత్వం అపహాస్యం చేసిందని తెదేపా రాష్ట్ర అధ్యక్షుడు కింజరాపు అచ్చెన్నాయుడు విమర్శించారు. ఏ చట్టం తీసుకొచ్చినా అది రాష్ట్ర వినాశనానికే దారి తీసింది తప్పితే.. సామాన్య ప్రజానీకానికి ఉపయోగపడలేదన్నారు. జగన్ ప్రభుత్వ హయాంలో తీసుకొచ్చిన ప్రజా వ్యతిరేక చట్టాల జీవోలను దహనం చేసినట్లు తెలిపారు. "నేడు శాసనసభ సమావేశాల చిట్టచివరి రోజు. సభను ప్రభుత్వం అపహాస్యం చేసింది. ఉదయం 9 గంటలకు సమావేశాలు ప్రారంభమవుతాయని చెప్పారు. కోరం లేకపోవడంతో సభను 9.15కి వాయిదా వేశారు. 2 గంటలైనా మళ్లీ సమావేశపరచలేదు. యాత్ర-2 సినిమా విడుదలవుతోందని అసెంబ్లీని వాయిదా వేశారు. అందుకే మేం నిరసన వ్యక్తం చేస్తూ బయటకు వచ్చాం" అని అన్నారు.



## టీ20ల్లో మిల్లర్ విధ్వంసం..

పొట్టి క్రికెట్‌లో దక్షిణాఫ్రికా ఆటగాడు డేవిడ్ మిల్లర్ రికార్డు సృష్టించాడు. 10 వేల పరుగులు పూర్తి చేసుకున్నాడు. స్వదేశంలో జరుగుతున్న ఎస్ఏ20(SA20) రెండో సీజన్‌లో మిల్లర్ ఈ ఫీట్ సాధించాడు. పార్ల్ రాయల్స్‌కు ఆడుతున్న మిల్లర్ బుధవారం జోబర్గ్ సూపర్ కింగ్స్‌తో జరిగిన ఎలిమినేటర్ మ్యాచ్‌లో మిల్లర్ 47 రన్స్ కొట్టాడు. దాంతో టీ20ల్లో పరుగుల మైలురాయికి చేరుకున్న తొలి దక్షిణాఫ్రికా ఆటగాడిగా మిల్లర్ చరిత్రపుటల్లోకెక్కాడు.ఈ ఫీట్‌తో అతడు వెస్టిండీస్ మాజీ ఓపెనర్ క్రిస్ గేల్, భారత క్రికెటర్ విరాట్ కోహ్లీ()ల సరసన చేరాడు. మొత్తంగా ఈ ఫార్మాట్‌లో 10 వేల రన్స్ కొట్టిన 12 క్రికెటర్‌గా ఈ చిచ్చరపిడుగు గుర్తింపు సాధించాడు. పొట్టి ఫార్మాట్‌లో అత్యధిక రన్స్ కొట్టిన సఫారీ క్రికెటర్లలో మిల్లర్ అగ్రస్థానంలో నిలవగా.. మాజీ కెప్టెన్ డివిలియర్స్ ఫాఫ్ డూప్లెసిస్‌లు 9 వేల పరుగులు సాధించారు.

క్రిస్ గేల్, విరాట్ కోహ్లీ

పొట్టి క్రికెట్‌లో 10 వేల పరుగులు చేసిన 12 మందిలో క్రిస్ గేల్ టాప్ ర్యాంక్‌లో ఉన్నాడు. ఈ మాజీ విధ్వంసక ఓపెనర్ ఖాతాలో 14,562 రన్స్ ఉన్నాయి. పాక్ మాజీ ఆల్‌రౌండర్ 13,077 రన్స్‌తో రెండో స్థానంలో కొనసాగుతున్నాడు. కీరన్ పోలార్డ్(12,577), అలెక్స్ హేల్స్(12,002), విరాట్ కోహ్లీ(11,994), డేవిడ్ వార్నర్(11,860), అరోన్ ఫించ్(11,458), రోహిత్ శర్మ(11,156), జోస్ బట్లర్(11,146), కొలిన్ మన్రో(10,602), జేమ్స్ విన్సే(10,019)లు పది వేల పరుగుల వీరుల జాబితాలో ఉన్నారు.



## ఎల్‌కే అడ్వానీని కలిసిన సీఎం నితీశ్ కుమార్

బీజేపీ అగ్రనేత ఎల్‌కే అడ్వానీని బీహార్ ముఖ్యమంత్రి , జేడీయూ నేత నితీశ్ కుమార్ కలిశారు. అడ్వానీకి ఇటీవలే కేంద్ర ప్రభుత్వం దేశ అత్యున్నత పౌర పుస్కారం 'భారత రత్న' ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో అడ్వానీని నితీశ్ మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. నితీశ్ కుమార్ ప్రస్తుతం ఢిల్లీలో పర్యటిస్తున్న విషయం తెలిసిందే. ఇటీవలే బీజేపీతో కలిసి రాష్ట్రంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన అనంతరం తొలిసారి ఆయన రాజధానిలో పర్యటిస్తున్నారు. ఈ పర్యటనలో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్‌షా, బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డాతో సమావేశం అయ్యారు.

## గ్లామరస్‌గా దిశా పటానీ

పటాని యొక్క ఈ రెడ్ లుక్ నుండి మీరు ఆలోచనలను తీసుకోవచ్చు. దిశా పటాని యొక్క ఈ 5 లుక్స్ వాలెంటైన్స్ డేకి సరిగ్గా సరిపోతాయి. వాలెంటైన్స్ డే రోజున అందమైన లుక్ కోసం, దిశా పటానీ ఈ రెడ్ లుక్ నుండి మీరు ఐడియాలను తీసుకోవచ్చు. దిశా పటానీ రెడ్ కలర్ షార్ట్ డ్రెస్ లో చాలా అందంగా ఉంది. నటి తేలికపాటి మేకప్‌తో మెరిసే దుస్తులతో ఉంది. దిశా పటానీ బ్లాక్ డ్రెస్‌లో చాలా అందంగా ఉంది. పొట్టి దుస్తులతో మ్యాచింగ్ కలర్ హై హీల్స్ ధరిస్తారు. లైట్ ఐషాడో మరియు రెడ్ కలర్ లిప్‌స్టిక్‌లో నటి చాలా గ్లామరస్‌గా కనిపిస్తోంది. దిశా యొక్క ఈ రూపాన్ని మోయడం ద్వారా మీరు కూడా చాలా అందంగా కనిపిస్తారు.దిశా పటానీ యొక్క ఈ లుక్ డిన్నర్ డేట్‌కి సరిగ్గా సరిపోతుంది. మీరు దిశా యొక్క ఈ అద్భుతమైన రూపాన్ని మళ్లీ సృష్టించవచ్చు. బ్రౌన్ స్లిట్ డ్రెస్ వేసుకోవడం వల్ల మీరు కూడా దిశా పటాని లాగా అందంగా కనిపిస్తారు. దిశా ఈ దుస్తులతో గోల్డెన్ షిమ్మరీ ఐ మేకప్ మరియు బ్రౌన్ కలర్ లిప్ స్టిక్ వేసుకుంది.